క్లుప్తంగా

కాలువల్లో పూడిక తొలగింపు



బాబ్‌కార్ట్‌తో పూడిక తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

భీమునిపట్నం : భీమిలి మెయిన్ రోడ్డు పక్కనున్న ప్రధాన కాలువలో పారిశుధ్య సిబ్బంది బుధవారం పూడికలు తొలగించారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా ఇక్కడి ప్రధాన కాలువలో పూడిక పేరుకుపోయింది. దీనివల్ల మురుగు నీరు నిలిచిపోవడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. కొన్ని చోట్ల వర్షం కురిసే సమయంలో కాలువ నిండిపోవడంతో రోడ్డు పైకి మురుగునీరు వస్తుండడం మరింత ఇబ్బందిగా మారింది. దీనిపై స్పందించిన పారిశుధ్య సిబ్బంది బాబ్‌కార్ట్ వాహనం సాయంతో కాలువలోని పూడికలు తొలగించారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



మృతి చెందిన ఆవు

కొమ్మాది : తెగిపడిన విద్యుత్ తీగ తగలడంతో విద్యుదాఘాతానికి గురై ఓ ఆవు మృతిచెందింది. తుఫాన్ నేపథ్యంలో జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ పరిధి రెడ్డిలపాలెంలో 5 రోజుల క్రితం ఈదురు గాలులుకు విద్యుత్ తీగ తెగి పడిపోయింది. దీంతో స్థానికులు ఆ తీగను తొలగించాలంటూ విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఈ క్రమంలో బుధవారం ఉదయం అటుగా వెళ్తున్న ఆవుకు విద్యుత్ తీగ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్ తీగ తెగిపడి ఉందని ఆ మార్గంలో 5 రోజుల నుంచి తాము రాకపోకలు నిలిపివేశామని రైతు బోర రాజు తెలిపాడు. ఇప్పటికైనా ఆ తీగను అధికారులు తొలగించకుంటే పెను ప్రమాదం తప్పదని, ఇలాంటి విషయాల్లో నిర్లక్ష్యం వహించడం సరైన పద్ధతి కాదంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా పట్టభద్రుల దినోత్సవం



పట్టభద్రుల దినోత్సవంలో శిల్పాగుప్త, తదితరులు

కొమ్మాది : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో పట్టభద్రుల దినోత్సవం (గ్రాడ్యుయేషన్ డే) బుధవారం ఘనంగా నిర్వహించారు. 3,168 మంది విద్యార్థులకు డిగ్రీలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎక్స్పెరస్ గ్రూప్ మాజీ ఎండీ శిల్ప గుప్త హాజరై ఇన్‌చార్జ్‌లకు దిశ నిర్దేశం చేశారు. వినూత్న ఆలోచనలతో అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. గీతం రిజిస్ట్రార్ గుణశేఖర్, వీసీ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు పాల్గొన్నారు.

సుత్తమ్మతల్లికి ప్రత్యేక పూజలు



చిప్పాడ గ్రామ దేవత సుత్తమ్మ తల్లి

తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ గ్రామదేవత సుత్తమ్మతల్లికి బుధవారం ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తులసి, గజమాలలతో అమ్మవారిని అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వందల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వర్షం కురిస్తే నరకప్రాయమే





వర్షం నీరు నిలిచిపోవడంతో సంగివలస వద్ద బురదమయమై రాకపోకలకు ఇబ్బందికరంగా మారిన పొండ్రంగి రహదారి

- బురద రోడ్డుపై ప్రయాణానికి మూడు మండలాల ప్రజలకు ఇబ్బందులు

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంగివలస నుంచి పద్మనాభం మండలం పొండ్రంగి, ఆనందపురం మండలం బోని గ్రామాల మీదుగా వెళ్లే రహదారి వర్షం కురిస్తే ఒకచోట చెరువులా మరో చోట బురదగా మారుతోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు పై మూడు మండలాల ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇటీవల ఈ మార్గంలో జీవీఎంసీ పైప్‌లైన్ నిర్మాణం కోసం బీటీ రోడ్డును తవ్వేసి... తర్వాత రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. అంతేకాకుండా ఈ మార్గంలో ఇటుక బట్టీల కోసం నిత్యం భారీ వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. దీంతో ఒత్తిడికి లోనైన రహదారి తరచూ శిథిలమవుతోంది. ప్రస్తుతం వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ రహదారి ప్రయాణానికి వీలు లేకుండా తయారైందని మూడు మండలాల ప్రజలు వాపోతున్నారు. ఈ బీటీరోడ్డుకు మరమ్మతులు నిర్వహించి ప్రయాణానికి అనువుగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.

తెరిపివ్వని వానతో రోడ్లు జలమయం

పీఎం పాలెం : తుఫాను కారణంగా కురుస్తున్న వర్షాలతో పలు చోట్ల రహదారులు జలమయమయ్యాయి. క్రికెట్ స్టేడియానికి సమీపంలో ఉన్న హౌసింగ్ బోర్డు కాలనీ అంతర రహదారులకు ఏళ్ల తరబడి మరమ్మతులు చేపట్టకపోవడంతో పలు చోట్ల గోతులు ఏర్పడ్డాయి. ఏమాత్రం వర్షం కురిసినా గతుకుల్లో నీరు చేరుతోంది. ఆ రోడ్లలో ప్రయాణించే పాదచారులు బురద నీరు కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



హౌసింగ్ బోర్డు కాలనీ రోడ్డుపై గోతిలో నిలిచిపోయిన వర్షం నీరు

సంప్రదాయ ఆటలకు ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జ్యోతికుమారి

భీమునిపట్నం : మన సంప్రదాయ ఆటలకు అందరూ ఎక్కువగా ప్రాధాన్యమివ్వాలని జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి సూచించారు. విద్యా వారోత్సవాల సందర్భంగా బుధవారం ఛాత్రోపాధ్యాయులకు సంప్రదాయ ఆటలైన బిళ్లకర్రా, తొక్కుడు బిళ్ల, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్స్, బంతాట నిర్వహించారు. పూర్వ రోజుల్లో ఎన్నో సరదా ఆటలు ఉండేవని, అవి ఆడడం వల్ల శరీరానికి ఎంతో వ్యాయామం జరిగేదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అటువంటి ఆటలు తగ్గిపోవడంతో ఆరోగ్య సమస్యలు పెరిగిపోతున్నాయన్నారు. నేటి తరం పిల్లలను ఈ ఆటలు ఆడించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ మాణిక్యం నాయుడు, అధ్యాపకులు గొట్టేటి రవి, జి.జి.ఎస్. నాగేశ్వరరావు, ఎం.మహాలక్ష్మి, జె.మాధవి, సోమయాజులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



భీమిలి క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

తగరపువలస : గంజాయి, అక్రమ మద్యం, ఇతర మత్తు పదార్థాల రవాణాకు చెక్ పెట్టేందుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది భీమిలి క్రాస్‌రోడ్డు చెక్ పోస్టు వద్ద బుధవారం విస్తృతంగా వాహనాలు తనిఖీ చేశారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ తనిఖీలు చేపడుతున్నట్టు తెలిపారు. తనిఖీల్లో సీఐ వి.రామకృష్ణ, సిబ్బంది కె.వి.బి.రావు, ఎన్.దేముడురాజు, వహీదా, రాణి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవిరావు

తగరపువలస : క్రీడలతో శారీరక, మానసిక ఎదుగుదలతోపాటు జ్ఞాపకశక్తి పెరుగుతుందని భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ చింతలపూడి చిరంజీవిరావు అన్నారు. జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో బుధవారం నిర్వహించిన శిక్షా - సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఆయన విద్యార్థులకు క్రీడల గురించి వివరించారు. పూర్వం చెడుగుడు, అష్టాచెమ్మ, డాడీ, ఏడుపెంకులు, పులి - మేక, ఒప్పులకుప్ప వయ్యారి భామ, చింత పిక్కలాట, గుడుగుడుగుంచం, దాగుడుమూత దండాకోర్, తొక్కుడు బిళ్ల, చదరంగం వంటి ఆటలు మానసిక ఉల్లాసం కలిగించేవన్నారు. అవన్నీ కనుమరుగైనా ప్రస్తుతం కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలీబాల్, టెన్నిస్, బ్యాడ్మింటన్, రన్నింగ్, జిమ్నాస్టిక్స్ వంటి ఆటలకు ప్రాధాన్యత పెరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, నరహరిశెట్టి రమేష్ పాల్గొన్నారు.

అసంపూర్తి రోడ్డుతో ప్రమాదాలు



అసంపూర్తిగా నిలిచిపోయిన కొండపేట - గుడివాడ రహదారి

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు కొండపేటలో అసంపూర్తిగా నిర్మించిన సీసీ రోడ్డు వెక్కిరిస్తున్నట్టుగా కనిపిస్తోంది. గత ఏడాది జీవీఎంసీ అభివృద్ధి నిధులతో ఈ సీసీ రోడ్డును నిర్మించినప్పుడు విల్సన్‌పేట జీవీఎంసీ పాఠశాల ఎదురుగా పైప్‌లైన్ మరమ్మతులకు గురైన చోట తాత్కాలికంగా వదిలేసి పనులు పూర్తి చేశారు. తర్వాత కొండపేట పంప్‌హౌస్ నుంచి కొత్త పైప్‌లైన్ కొండపేట కాలనీ మీదుగా మార్పు చేశారు. దీంతో పాత లైన్ మార్గంలో విల్సన్‌పేట పాఠశాలల ఎదురుగా సీసీ రోడ్డు వేయకుండా మిగిలిపోయిన భాగం ఎబ్బెట్టుగా కనిపిస్తోంది. అంతేకాకుండా చీకటి పడిన తర్వాత ఈ మార్గంలో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. అసంపూర్తిగా మిగిలిపోయిన సీసీరోడ్డును వెంటనే పూర్తి చేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడపొద్దు



తగరపువలస మెయిన్‌రోడ్డులో వాహనాల రాకపోకలను పరిశీలిస్తున్న సీఐ కాంతారావు

తగరపువలస : భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో పలుచోట్ల ట్రాఫిక్ సీఐ కాంతారావు ఆధ్వర్యంలో వాహనాల రాకపోకలపై బుధవారం తనిఖీలు నిర్వహించారు. రన్నింగ్‌లో ఉన్న వాహనాలను నిలిపి ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడంతోపాటు ప్రమాదాల నివారణకు, ప్రయాణికుల భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆటో కార్మికులకు వివరించారు. వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేసి ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా చూడాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, పరిమితికి మించి ప్రయాణికులతో రాకపోకలు ప్రమాదకరమని తెలిపారు. ట్రాఫిక్ ఎస్ఐ చింతలపూడి చిరంజీవిరావుతో సహా సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకిచ్చిన హామీ నిలబెట్టుకోవాలి



బక్కన్నపాలెంలో నిరశన తెలుపుతున్న భూములు కోల్పోయిన రైతులు, సీపీఎం నాయకులు

మధురవాడ : కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం గ్రామాలకు చెందిన భూములు కోల్పోయిన రైతులకు అధికారులు, నాయకులు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని రైతులు కోరారు. బుధవారం బక్కన్నపాలెంలోని ఎన్టీఆర్ హుద్‌హుద్ గృహ సముదాయం వద్ద బాధిత రైతులు బుధవారం నిరశన చేపట్టారు. దశాబ్దాల తరబడి పోరాడుతున్న రైతులకు ఇళ్లు ఇవ్వకుండా ఉత్తర నియోజకవర్గానికి చెందిన వారికి ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ సంస్థ ఇళ్లు ఎలా కేటాయించిందని ప్రశ్నించారు. భూములు కోల్పోయిన తమకు ఇళ్లు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. పేద దళిత, బీసీ రైతులకు న్యాయం చేయాలని కోరారు. బాధిత రైతులకు తక్షణమే కాలనీ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం ప్రతినిధులు ఎస్.పైడిరాజు, బి.పోతురాజు, సీపీఎం నాయకులు డి.అప్పలరాజు, కేవీపీఎస్ నాయకులు ఎస్.పైడితల్లి, కె.నాగరావుజు, నరసియ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

'నో డెవలప్‌మెంట్ జోన్ నుంచి మినహాయించాలి'

మహారాణిపేట : భీమిలి మండలంలో నేరెళ్లవలస, తొట్లకొండ పరిధిలో నాలుగు గ్రామాలకు సీఆర్‌జెడ్ - 3లో నో డెవలప్‌మెంట్ జోన్ నుంచి మినహాయింపు ఇవ్వాలని పలువురు కోరారు. బుధవారం ఈ గ్రామాలకు చెందిన ప్రజలు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. భీమిలి మండలంలో చేపలుప్పాడ, కాపులుప్పాడ, నిడిగట్టు, నేరెళ్లవలస గ్రామాలు సీఆర్‌జెడ్ - 3లో నో డవలప్‌మెంట్ జోన్‌లో ఉన్నాయన్నారు. దీని వల్ల ఈ గ్రామాల అభివృద్ధి జరగడం లేదని, జోన్‌ను ఎత్తి వేయాలని కోరారు. భీమిలి ప్రాంతం ప్రగతి సాధించి, ఎంతో ముందుకు వెళ్తుంటే ఈ నాలుగు గ్రామాలు మాత్రం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిపోయాయని కలెక్టర్‌కు వివరించారు. పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

హెల్మెట్ ధారణతో సురక్షిత ప్రయాణం



హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న డీఎల్ఎస్ఏ సెక్రటరీ ఎం.వి.శేషమ్మ

మద్దిలపాలెం: ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసే క్రమంలో విధిగా హెల్మెట్ ధరించాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఎం. వి.శేషమ్మ అన్నారు. హెల్మెట్ ధారణపై మద్దిలపాలెం ఆర్టీసీ డిపో వద్ద బుధవారం ఆర్టీసీ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సురక్షితంగా గమ్యం చేరుకోవడానికి హెల్మెట్ తప్పనిసరన్నారు. విధులకు హాజరయ్యేందుకు ఇంటి వద్ద నుంచి వచ్చేటప్పుడు సిబ్బంది విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్లాపస్ చైర్మన్ వల్లభనాయుడు, ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం జి.సత్యనారాయణ, మద్దిలపాలెం డిపో మేనేజర్ ఎస్.అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

లారీ కింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఎంవీపీ కాలనీ: జాతీయ రహదారి సత్యం కూడలిలో లారీ కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సత్యం కూడలిలో బుధవారం తెల్లవారుజామున 6 గంటలకు ముందు ఓ వ్యక్తి బస్సు కింద పడి ఆత్మహత్య చేసుకొనేందుకు ప్రయత్నించగా.. డ్రైవర్ అప్రమత్తమయ్యారు. బస్సును సడన్‌గా ఆపేయడంతో ఆయన ప్రయత్నం విఫలమైంది. బస్సు డ్రైవర్ దిగి అతన్ని రెండు కొట్టి కూడలి సమీపంలో కూర్చోబెట్టి వెళ్లిపోయాడు. స్థానికులు సైతం అతనికి సపర్యలు చేసి వెళ్లిపోయారు. కొద్ది సేపటి తరువాత మళ్లీ ఆ వ్యక్తి జాతీయ రహదారిపై వస్తున్న మరో లారీ వెనక చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఎంవీపీ పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలియదని స్థానికులు చెప్పారు. అయితే ఆయన బస్సు కింద పడేందుకు ప్రయత్నించడం, అనంతరం లారీ కింద పడి మృతి చెందిన ఘటనలను పోలీసులకు వివరించారు. గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో గానీ, 83310 41626 ఫోన్ నంబర్‌లో గానీ సంప్రదించాలని కోరారు.

విద్యుత్ దీపాల పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..

పీఎం పాలెం : పాత పీఎం పాలెం రోడ్డులో వీధిలైట్లు వెలగక అంధకారం నెలకొందని సాక్షిలో బుధవారం ప్రచురించిన వార్తకు జీవీఎంసీ అధికారులు స్పందించారు. రోడ్డు పొడవునా ఉన్న విద్యుత్ స్తంభాలకు ఎల్ఈడీ లైట్లు పునరుద్ధరించారు. దీంతో ఆ రోడ్డులో ప్రయాణించే పాదచారులకు వీధి దీపాల సమస్య తొలగింది. స్థానికంగా మిగతా ప్రాంతాల్లోనూ వెలగని చోట విద్యుత్ దీపాలు పునరుద్ధరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



పునరుద్ధరించిన వీధి లైట్లు

వీధిలైట్లు వెలగక చిమ్మచీకట్లు



చిమ్మ చీకట్లు అలుముకుంటున్న మారికవలస జంక్షన్ - పీపీ 2 కాలనీ రోడ్డు



లైట్లు లేని విద్యుత్ స్తంభాలు

మధురవాడ : జీవీఎంసీ జోన్ – 2లోని పలు ప్రాంతాల్లో రహదారుల వెంట, కాలనీల వద్ద వీధిలైట్లు లేక అంధకారం నెలకొనడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా జీవీఎంసీ 5వ వార్డు మారికవలస జంక్షన్ నుంచి తిమ్మాపురం వెళ్లే రోడ్డులో జేఎన్ఎన్‌యూఆర్ఎం పరదేశిపాలెం – 2తోపాటు మరో కాలనీ ఇక్కడ ఉంది. సుమారు 300పైగా నివాసాలతోపాటు పలు విద్యా, ఇతర సంస్థలు ఈ రోడ్డులోనే ఉన్నాయి. ఈ రోడ్డులో పలువురు విశాఖ నగరంతోపాటు ఇతర ప్రాంతాల్లో పనులు చేసుకుని రాత్రి వేళ వస్తుంటారు. ఐటీ సెజ్ తదితర చోట్ల పనులు చేసే కార్మికులు, ఉద్యోగులు రాత్రి సమయాల్లో కూడా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు ఒక వైపు కొండ, మరో వైపు దట్టమైన పొదలతో నిండి నిర్మానుష్యంగా వుంటుంది. దీంతో వన్య మృగాలతోపాటు, విష పురుగుల సంచారం అధికంగా ఉంటుంది. ఇక్కడ ఉన్న మాస్టర్ ప్లాన్ రోడ్డుకి లైటింగ్ లేదు. ఉన్న స్తంభాలకు కూడా లైట్లు లేకపోవడంతో ఈ మార్గంలో రాకపోకలంటేనే మహిళలు, విద్యార్థులు, వృద్ధులు భయపడుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి లైటింగ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యా రంగంలో సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎంఈవో రమణకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

పద్మనాభం : విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు సత్వరమే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఆర్.అంబేడ్కర్, కార్యదర్శి ఉప్పాడ రాము, తదితరులు ఎంఈవో పి.రమణకు బుధవారం వినతిపత్రం అందించారు. జీవో నంబర్ 117ను రద్దు చేయాలని, 55వ నంబర్ జీవో ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలని, ప్రీ ప్రైమరీతో పాటు ఒకటి నుంచి ఐదు తరగతులను ఒకే పాఠశాలలో నడపాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానాన్ని అమలు చేయాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని, పని భారం తగ్గించాలని, హైస్కూళ్లలో బోధనేతర సిబ్బందిని నియమించాలని, కోవిడ్ సమయంలో మృతి చెందిన మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల వారసులకు కారుణ్య నియామకాలు కల్పించాలని, విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎన్.నారాయణరావు, మండల ప్రధాన కార్యదర్శి కె.సన్యాసిరావు, జిల్లా కౌన్సిలర్ పి.వి.రమణ, జి.భాస్కరరావు వినతి పత్రం అందించారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్సీ శైలజావల్లి

మధురవాడ : సచివాలయ కార్యదర్శులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జోనల్ కమిషనర్ శైలజావల్లి ఆదేశించారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో జోన్ పరిధిలోని 9 వార్డులకు చెందిన ఎమినిటీస్ సెక్రటరీలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యంగా పింఛన్లు సకాలంలో పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం మారిన దృష్ట్యా వచ్చే కొత్త పథకాలు అమలులో కూడా అంతా కృతనిశ్చయంతో పనిచేయాలన్నారు. విభాగాల అధిపతుల సూచనలు, ఆదేశాలు తప్పకుండా పాటించాలన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అప్పలరాజు, ఏపీడీ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్ పథకం అమలు పరిశీలన



గిడిజాలలో కేంద్ర బృందం సభ్యులు

తగరపువలస : ఆనందపురం మండలం గొట్టిపల్లి, కణమాం, గిడిజాల, వెంకటాపురం పంచాయతీల్లో బుధవారం కేంద్ర బృందం పర్యటించింది. ఇటీవల ఆయా గ్రామాల్లో అమలు చేసిన జల్ జీవన్ మిషన్ పథకంపై ఆరా తీశారు. ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. నీటి నాణ్యత, శుద్ధి పరీక్షలు చేయించారు. నీటి నాణ్యత, నివాసాల మధ్య నీటి నిల్వలు, గ్రామంలో పారిశుధ్యం తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా ప్రతినిధి స్వప్న, జిల్లా కో ఆర్డినేటర్ పుల్లయ్య, ఎంపీడీవో ఎన్.అప్పలనాయుడు, డిప్యూటీ ఈఈ ఎస్.ఎస్.ఆర్.మూర్తి, ఈవోపీఆర్డీ కె.రామారావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎం.దుర్గాంబ, ఏఈ ఎం.తిరుమలరావు, గిడిజాల, గొట్టిపల్లి, కణమాం సర్పంచ్‌లు షిణగం అప్పలరాజు, గంటా జగదీష్, ఎ.అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు దొంతల కనకరాజు, కోరాడ నాయుడుబాబు, పంచాయతీ కార్యదర్శులు, నీటి సరఫరా విభాగం అధికారులు, వివిధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బోధనాభ్యసన సామగ్రి



మధురవాడ ఆర్‌హెచ్‌సీ ప్రాథమిక పాఠశాలలో ఆకట్టుకున్న టీఎల్ఎమ్ ప్రదర్శన

మధురవాడ : రాష్ట్ర నూతన విద్యా విధానం వార్షికోత్సవాలతోపాటు శిక్షా సప్తాహ్ కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు నిర్వహిస్తున్న బోధనాభ్యసన సామగ్రి ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. గణేష్‌నగర్‌లోని ఆర్‌హెచ్‌సీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న ప్రదర్శన బుధవారం ముగిసింది. విద్యార్థులు తమ చిట్టి ఆలోచనలతో తయారు చేసిన లెక్కలు, సామాన్య శాస్త్రం, తదితర నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ముగింపు కార్యక్రమంలో విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు ఎన్.ప్రభాకరరావు అభినందించారు. వీరి ప్రదర్శనను డీఈవో ఎల్.చంద్రకళ మెచ్చుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.మురళి, కె.రాజేశ్వరి, బొడ్డు గోవింద్, వి.వాసవి, బూడి గోవింద, ఎం.శుభ, సీహెచ్ అచ్యుత వల్లి, జయంతి, లక్ష్మీప్రియ పాల్గొన్నారు.